# ధరణి



క్రీ.శ. ఒకటో శతాబ్దం!

ఉషోదయపు చిగురు టెండ....


కృష్ణవేణమ్మ కన్నీటి చుక్కల్లో గుచ్చుకుని, పరావర్తనం చెందుతూ వెలుతురు కిరణాలు మెరుస్తోన్నాయి, జిగేల్మని.

ఒంపులు తిరుగుతూ కదిలి పోతోన్న కృష్ణవేణమ్మ అలల మీద ఉయ్యాల లూగుతూ, గర్వంగా వొడ్డు కేసి నింపాదిగా జరుగుతూ వస్తోన్నాయి రెండు శవాలు! స్మృతి పథంలో మెలి పడుతూ కలత పెట్టే జ్ఞాపకాలకు మల్లే.



"రాజావారి దర్బార్లో ధరణి విసిరిన సవాలుకు ఇదా అంతరార్థం? చస్తూ కూడా మనందరి మీదా కక్ష సాధించేరు.... అల్పాయుష్కులు!" - లోహత్వం నిండిన ఒక గొంతు గట్టు మీద 'గరగర' లాడింది.

"ఇహ మనం సంధ్య వార్చినట్టే! కుల భ్రష్టమైన ఈ ప్రేమ జంటకు రాజా వారి చేత శిక్ష విధింపించే మని ఆనంద పడ్డామే కానీ, వీళ్లిలా పవిత్ర జలాల్లో దూకి, ప్రాణ త్యాగం చేస్తారనుకో లేదు. వీరి శవాల స్పర్శతో కృష్ణవేణమ్మ కూడా కలుషితమైనట్టే కదా మరి?"



- గోపరాజు నాగేశ్వరరావు

శాస్త్రాలను శోధిస్తూ చర్చల తోటే గట్టు మీది ఆకారాలు సత్యాన్ని మధిస్తున్నాయి, అనంతానంతంగా!

☆ ☆ ☆ ☆ ☆

ధరణి కోట కన్యలు....

దూకే జల పాతాలను సహితం స్తంభింపించే అందాల రానులు, అలవోకగా కృష్ణవేణమ్మ అలల మీద కార్తీక దీపాలు విడుస్తోన్న వేళ....

నిప్పు పూలను మోసుకుంటూ కృష్ణవేణమ్మ యోగిని లా సాగి పోతోంది!

నది నిండా గవ్వలు దొర్లుతోన్న నునులేత సవ్వడి!

నది మీద....

కను చూపు అంచుల్లో దూరంగా కదిలి వస్తోందో పడవ, - మనిషి అజ్ఞానానికి మదన పడుతూ తల పంకిస్తున్న జ్ఞానిలా!

పడవ లోంచి దూరం చూస్తూ ఆనందంతో కేరింతలు పెట్టేడు చుంగ్!

మంచు పరదాల్లోంచి, గాల్లోకి పాకుతూ, ఆకాశం వేపుకు పయనిస్తోన్న ధరణి కోట దీపాల కాంతి.

సరంగు నిర్వికారంగా పడవ నడుపుతున్నాడు.

భూగోళపు మరో వేపు సత్యాలను శోధించి వస్తోన్న సూర్యుడప్పుడే, తన తొలి వెల్తురు కిరణాలతో జగత్తును కాంతి మంతం చేస్తోన్నాడు.

పడవలో - లయ బద్ధంగా ఊగుతూ, తన చేతిలోని పింగాణీ పాత్ర మీద తను పొదిగిన ఊహాసుందరి చిత్రం వేపే రెప్పార్పకుండా చూస్తూ నించున్నాడు, చైనా దేశపు కళాకారుడు చుంగ్.

ఎక్కడి చైనా దేశం, ఎక్కడి భారతదేశం!

పడవ నింపాదిగా ముందుకు సాగి పోతోంది.....

సరంగు, ధ్యానం లోంచి బయట పడ్డ ఋషిలా నిర్లిప్తగా నవ్వే డొకసారి!

భారత దేశంతో వ్యాపారం కోసం, సుదూర దేశాల నించి వచ్చే చాలా మంది విదేశీయుల్ని చూసిన అనుభవం ఆ సరంగుకుంది. ఆత్మీయుల ఎడబాటుతో కాలం వాళ్లనలా భావుకుల్లా మారుస్తుందేమో!

ఎంత మంది విదేశీ యాత్రికులు తన పడవలో విరహ వేదన పడ్డారో. మరెంత మంది విషాదంతో వేగి పోతో గుండె కమిలి ఏడ్చేరో!

పడవ రేవుకు చేరుకుంది.

పింగాణీ పాత్రలున్న చెక్క పెట్టెల్ని ఒడ్డుకు చేర్చే ప్రయత్నంలో మునిగి పోయేడు సరంగు.

చుంగ్ చేతిలో అతడి ఊహాసుందరి చిత్రాన్ని పొదిగిన పింగాణీ పాత్ర అలాగే ఉంది.

పడవ దిగి వొడ్డు వేపుకు నడవ సాగేడు.

అప్పుడు గమనించేడు చుంగ్, కృష్ణవేణమ్మ అలల మీద తేలిపోతో, ధ్యేయం తెలియని ప్రస్థానం సాగిస్తో కదిలిపోతోన్నాయి కార్తీక దీపాలు!

గుంపులు, గుంపులుగా వెళ్తోన్న ఆ దీపాలకు కొంచెం వెనగ్గా, ఒంటరిగా మరో దీపం; హంస ల్లోనూ రాజహంసకు మల్లే....

ఆ దీపాన్ని చూసిన చుంగ్ కళ్లు తళుక్కున మెరిసేయి!

అటు వేపుకు నడిచేడు....

కిందికి వొంగి ఆ దీపాన్ని దోసిట్లోకి తీసుకుని విప్పారిన కళ్లతో చూసేడు, అపురూపంగా.

ఎందుకో గాని, చుంగ్ ఒళ్లు జల్దరించింది!

ఆ దీప స్పర్శతో హృదయ తంత్రులన్నీ రాగబద్ధమౌతూ, చలించ సాగేయి!

ఎవరెన్ను కన్నా ఎత్తైన నా
ఊహా శిఖరాల్ని వీళ్ళెక్కలేరు
సింధూరం కన్న ఎరుపైన నా
హృదయా [illegible] ళ్ళు చదవలేరు
ఇల్లు వి [illegible] ళ్ళు మరచి
ఒక్కసారి రా చెలీ !

\- తిలక్

దీపాన్ని జాగ్రత్తగా తిరిగి అలల మీద ఒదిలి, గట్టు కేసి నడవ సాగేడు చుంగ్.

ఒడ్డుకు చేరే కొద్దీ పల్చబార్తోన్న కృష్ణ వేణమ్మ అంచుల తేట నీళ్లు చుంగ్ పాదాల తాకిడికి గలగలా తుళ్లి, వలయాల్లా దూరంగా కదిలి పోతూ........

గట్టు మీద నిలబడి ధ్యానంగా చూస్తున్న ధరణి కళ్లు తళుక్కున మెరిసేయి. కృష్ణమ్మ అలల మీద ఆ 'రాజహంస' దీపాన్ని విడిచి పెట్టింది తనే!

ధరణి!

అందానికి నిర్వచనం...

యవ్వన ప్రాంగణంలో కాలూనిన క్షణం నించే అనుక్షణం సరికొత్త అందాలను సంతరించుకుంటూ....

ధరణి గుండెలో అలజడి మొదలైంది.

అర్థం తెలియని ఏదో భయం!

చేతిలో పింగాణీ పాత్రను జాగ్రత్తగా పట్టుకుని చుంగ్ హుందాగా నడుస్తూ ధరణి వేపే వస్తోన్నాడు.

చుట్టూ చూసింది. స్నేహితురాళ్లంతా ఆ వస్తోన్న చుంగ్ వేపే చూస్తూ మౌనంగా నించున్నారు.

దగ్గరికి వచ్చి, ధరణి ముందు నిలబడి తలెత్తి ధరణి ముఖంలోకి చూసేడు చుంగ్.

సంభ్రమం!

ఎన్నోయుగాల నిరీక్షణ సఫలమై, ఇక కనిపించదనుకున్న దేవత కరుణించి కళ్లముందు ప్రత్యక్షమైనట్టో........

చుంగ్ ఆనందం పట్టలేక తబ్బిబ్బవుతూ, కళ్లు విప్పార్చి మరీ ధరణి వేపే ఆరాధనగా చూస్తున్నాడు.

తన ఊహా సుందరి ఆమే! పాత్ర మీద తను చిత్రించుకుని, ఎన్నో ఏండ్లుగా ఆ అద్భుత సౌందర్య రాశి దర్శనం కోసం చుంగ్ నిరంతర అన్వేషణ ఇంతకాలానికి ఫలించింది.

చుంగ్ కళ్లలోంచి ఆనంద బాష్పాలు జలజలా రాల్తున్నాయి!

చేతులు ముందుకు చాపి, పింగాణీ పాత్రను ధరణికిచ్చేడు చుంగ్.

అంతదాకా పరధ్యానంగా చూస్తోన్న ధరణి అసంకల్పంగానే పాత్రను అందుకుంది.

చుంగ్ చేసిన సైగను గమనించి పాత్ర మీది చిత్రాన్ని చూసింది.

నీరెండలో నీటిపైకి తుళ్లి పడే చేపలకు మల్లే ధరణి కళ్లు మిల మిలా మెరిసేయి.

ఆశ్చర్యంగా ఆ చిత్రం వేపే చూస్తుండి పోయింది ధరణి.

హృదయం సన్నగా ప్రకంపిస్తోంది.

ధరణి కళ్లు సిగ్గుతో వాలిపోతోన్నాయి.

చుంగ్ ధరణి పరిస్థితిని అర్థం చేసుకున్నాడు.

ఆంధ్ర ప్రాంతపు సరంగుల నుండి చుంగ్ నేర్చుకున్న ఒకే ఒక్క తెలుగు పదాన్ని గొంతెత్తి ఉచ్ఛరించేడు చుంగ్!

పరిసరాలు ప్రతిధ్వనిస్తోన్నాయి....

"ప్రేమ....ప్రేమ!"

ధరణి నివ్వెర పోయింది ! స్నేహితురాళ్లంతా ఘొల్లున నవ్వేరు.

భ్రమర స్పర్శతో చలించి పోయే కన్నె కుసుమంలా కంపించి పోతోపింగాణీ పాత్రను గుండెకు హత్తుకుని, లేడిలా గెంతి దూరంగా పారిపోతోంది ధరణి.

చుంగ్ కళ్లలో మజిలీ చేరుకున్న ఆనందం, రవ్వల్లా మెరుస్తో.......

***

ధరణి కోటలో పింగాణీ పాత్రలు అమ్మేందుకు చుంగ్‌కు రాజావారి అనుమతి చిక్కింది.

కృష్ణానది తీరాన పెద్ద టెంటు వేసి పాత్రలను అమ్మకానికి పెట్టేడు చుంగ్. ఆ పాత్రల అందాన్ని చూసి ధరణి కోట వాసులు ముగ్ధులయ్యేరు.

చుంగ్ వ్యాపారం జోరందుకుంది. కనక వర్షం కురుస్తోంది!

అయినా చుంగ్‌కు ఆదాయం మీదా, వ్యాపారం పట్లా అంతగా ఆసక్తి లేకుండా పోయింది. అతడి మనసంతా ధరణి చుట్టూనే పరిభ్రమిస్తోంది.

ధరణి కోసం తను ధరణి కోటలో మకాం కొనసాగించాలి కనక చుంగ్‌కు తన వ్యాపారం కేవలం ఒక మిషమాత్రమే!

★ ★ ★ ★ ★

చుంగ్ కల ఫలించే ఘడియ ఆసన్నమైంది.

అతడి కలల పంట, ధరణి- కాలి అందెల చప్పుడు వెంటే లయబద్ధంగా అడుగులు వేస్తూ, వెన్నెల్ని కుమ్మరిస్తోన్న చందమామకు మల్లే దివ్యంగా వెలిగిపోతో, పింగాణీ పాత్రల్ని చూసేందుకు వచ్చిందోరోజు.

చుంగ్ హృదయ తంత్రులు స్వర బద్ధమౌతో, తాపానికి బాణీని కూర్చి మౌనరాగాలను పలికించసాగేయి.

"ప్రేమ....ప్రేమ"అన్న చుంగ్ అరుపుకు ధరణి చివాల్న తలెత్తి చుంగ్ కళ్లలోకి ఆర్తిగా చూసింది. గవ్వలు రాపిడి పడ్డట్టో, గలగలా నవ్వి, కృష్ణమ్మ అలకు మల్లేనే మృదువుగా కదిలి, క్షణంలో అదృశ్యమై పోయింది.

తొలకరిజల్లుకు పులకించిన ప్రకృతికి మల్లే చుంగ్ ఆనందంతో తేలిపోతో పరిసరాలు బదులు పలికేంతగా గొంతెత్తి అరవసాగేడు -

"ప్రేమ ......ప్రేమ'

★ ★ ★ ★ ★

ధరణి, చుంగ్‌ల ప్రేమ కథకు పేజీలను కూరుస్తూ, కాలం మంచులా కరిగిపోతోం..

ఇప్పుడు ధరణికోటలో ఆ కొమ్మ, రెమ్మలకు తెలుసు, అది ప్రేమ జంట అని. భ్రమరాలకూ, పూలకూ తెలుసు, ఆ ప్రేమ జంటను చూసి తాము కూడా మురిసి పోతోన్నట్టు.

కృష్ణవేణమ్మ సరే సరి! ఆ ప్రేమ జంట ఆట పాటలకు మురిసిపోతూ గలగలా ఉప్పొంగి ఎన్ని మార్లు సుళ్లు పళ్లేదు!

ఆకాశం నించి అక్కడ జారే వెన్నెలకూ తెలుసు, చుంగ్, ధరణిలను ఎవ్వరూ విడదీయలేరని.

ఆకాశం నుండి తేలివెన్నెల జాలు కురుస్తోంది.

ఆ వెన్నెల్లో, కృష్ణమ్మ ఒడ్డున ఇసుక తిన్నెల మీద పరుగులు పెడుతోందా ప్రేమ జంట.

అలసి - ఆగి, ధరణికి సైగ చేసేడు చుంగ్ - అధరాలను అందించమని!

చుంగ్ సైగల అర్థం ధరణికి తెలుసు. సైగలతోటే ధరణి చెప్పే సమాధానం చుంగ్‌కు తెలుసు.

**అసలు భాషే లేని ఆదిమ సమాజం** నుండి నేటి దాకా 'ప్రేమభాషే' ప్రపంచాన్ని ఏల్తోంది! అలాగే ఆ జంటనూ......

చిరు కోపం తెచ్చుకుంది ధరణి.

ఇసుకను దోసిళ్ళతో ఎత్తి నిర్విరామంగా చుంగ్ మీదికి విసుర్తో.......

ఆ దృశ్యాన్ని చూసి, పెద్దరికపు హుందాతో ముఖం తిప్పుకుని కృష్ణవేణమ్మ కొండల మాటుకు ఒంపు తిరిగి దాకుంటూ గలగలా నవ్వుతోంది.

ధరణి, అలసి పోయింది. ఇసుకలో వెల్లికితలా పడుకుని, పైట పరదా వెనక ముఖాన్ని దాచేసుకుంది.

ఒంటిమీద నిల్చిన ఇసుక రేణువుల్ని దులుపుకుంటూ పిల్లిలా మెత్తగా నడిచి, ధరణిని సమీపించేడు చుంగ్. ధరణి ముఖం మీద పరుచుకున్న తెల్లటి పైట పరదాలోంచి ధరణి గులాబి రంగు పెదాల కాంతి స్పష్టంగా కనిపిస్తోంది.

అమాంతం ముందుకు ఒంగి, గాఢంగా చుంబించేడు చుంగ్!

ఆ వేడిమికి ధరణి మంచులా కరిగింది.

ఏదో వివశత్వం!

యాంత్రికంగా రెండు చేతులూ చాపి లతలా చుంగ్‌ను అల్లుకుపోయింది.

కృష్ణమ్మ గట్టుమీద నిలబడి చోద్యంగా అంతా గమనిస్తోన్న కొన్ని మానవాకారాలను ఆ ప్రేమ జంట గమనించనే లేదు.

"అంతా కలిమాయ! వర్ణ వ్యవస్థ బీటలు వారకముందే మనం జాగ్రత్త పడాలి. పదండి.... ప్రధాన అర్చకుల వారికి ఫిర్యాదు చేద్దాం. అనంతరం విషయాన్ని రాజా వారి దృష్టికి తెచ్చి ఈ అవాంతరాన్ని నిరోధిద్దాం...."

గట్టు మీది ఆకారాలు గుట్టు చప్పుడుగా ఆలయం వేపుకు కదిలిపోతోన్నాయి.

☆ ☆ ☆ ☆ ☆

ఆకాశంలో పూర్ణచంద్రుడు కంగాళీగా కదిలి పోతోన్నాడు.

కృష్ణమ్మ ఇసుక తిన్నెల మీద వెల్లికితలా పడుకుని ఆకాశపు వెండి పళ్లెం వేపే దీక్షగా చూస్తోన్న ఆ ప్రేమ జంట, తృళ్లి పడి దిగ్గున లేచి నించుంది.

ఎవరో వస్తోన్న అలికిడి!

పరికించి చూసిన ధరణి, ఆ వస్తోంది గుడి ప్రధాన అర్చకుడని గ్రహించింది.

> చిరిగిన స్వప్నపు సంచీలో
> చితికిన బాష్పం నిలవదు
> అందుకే నేస్తం జీవితమే ఒక జూదం
> భేదానికి మోదానికి లేదసలే భేదం
>
> \- తిలక్

దూరంగా పారిపోయే ప్రయత్నం ప్రారంభించిన చుంగ్ చేతిని తన చేతితో బలంగా బిగించి పట్టుకుని, అప్పటికప్పుడే ప్రోగు పడి ఒనగూడిన స్థిర చిత్తంతో అర్చకుల వారికి ఎదురు నడిచింది ధరణి.

అర్చకుల వారు ఆగి తీక్షణంగా చూసేరు.

వారి వెనక దూరంగా మానవాకారాలు తమలో తమే చర్చించుకుంటో.......

"నేను మనసా, వాచా, కర్మణా చుంగ్‌ను ప్రేమిస్తున్నాను. మమ్మల్ని సానుభూతితో అర్థం చేసుకుని, ఆశీర్వదించండి......." అంటూ ధరణి అర్చకుల వారి పాదాల మీద వాలి పోయింది తమకంగా.

"ఛీ......భ్రష్టురాలా! వర్ణ సంక్రమణానికి విధించే శిక్ష తెలిసి కూడా సిగ్గూ, బిడియం లేకుండా అర్చకుల వారి పాదాలనే తాకి ఆశ్రయం అర్థిస్తావా? ఎంత ధైర్యం! రేపు రాజా వారి దర్బార్లో మీ ఇద్దరికీ ఎలాంటి దుర్గతి ఎదురౌతుందో చూడండి"అంటూ, విసవిసా నడుస్తూ వెళ్లి, ఆకారాలను వెంట పెట్టుకుని అదృశ్యమైపోయేరు ప్రధాన అర్చకుల వారు.

భయం నిండిన కళ్లతో ధరణి వేపు చూసేడు చుంగ్.

ధరణి గలగలా నవ్వింది! అలాగే చుంగ్ చెయ్యి పట్టుకుని ఆలయం వేపుకు నడిపించింది.

కృష్ణవేణమ్మ గట్టు దాటి, పాదల మధ్య నించి కాలిబాట వెంట గెంతుతూ, తృళ్లుతూ, ఆనందంతో తేలిపోతో సుడిగాల్లా సాగిపోతోంది ధరణి.

ఎక్కడికో?

ఆ సమయంలో ధరణి ప్రవర్తన చుంగ్‌కు వింతగా తోచింది.

ఇద్దరూ ఆలయంలోకి ప్రవేశించేరు.

ధరణి దృష్టి అంతా గర్భ గుడి మీదే ఉంది. చుంగ్‌ను లాక్కుపోతో నేరుగా గర్భగుడిలోకి నడిచిపోతోంది ధరణి.

దీక్షగా వేదాధ్యయనం చేస్తోన్న గొంతులు మౌనం దాల్చేయి.

ఆలయం మొత్తం, తుఫాను ముందు ప్రశాంతతకు మల్లే నిశ్శబ్దంగా మారింది.

పురోహితులూ, వేద విద్యార్థులూ గుడ్లప్పగించి చూస్తున్నారు.

ధరణి గర్భగుడిలోకి వెళ్లి, అమ్మవారి మెడలో వ్రేలాడుతోన్న రెండు పూల దండల్ని తీసుకుని ఒకదాన్ని చుంగ్‌కు ఇచ్చి, తన చేతిలో ఉన్న దండను చుంగ్ మెడలో వేసింది.

ధరణి సైగతో చుంగ్ తన చేతిలోని దండను ధరణి మెడలో వేసేడు.

ఇద్దరూ అమ్మవారికి నమస్కరించేరు.

ఒక ప్రళయం ఓంకారం పల్కిందప్పుడే!

**అక్కడ, ఆలయ ప్రధాన అర్చకులు** రాజావారికి ధరణి,చుంగ్‌ల ప్రేమ వ్యవహారాన్ని ఫిర్యాదు చేస్తున్నారు!

☆ ☆ ☆ ☆ ☆

ఎదురు చూస్తున్న సమయం రానే వచ్చింది.

అప్పటిదాకా నిశ్శబ్దంగా ఉన్న రాజావారి దర్బారులో సన్నగా కలకలం మొదలైంది.

వందిమాగాధుల స్తోత్రాలు మొదలయ్యేయి. ఆ వెంటనే రాజావారు గంభీరంగా నడిచి వచ్చి ధర్మాసనం అలంకరించేరు.

సభ ఉత్కంఠతో ఉక్కిరి బిక్కిరై పోతోంది. కొంచెం సేపటిలో ఆ ప్రేమ జంట భవితవ్యం రాజా వారి తీర్పుతో శాశించ బడుతుంది!

వాదోప వాదాలు మొదలయ్యేయి.

"....వర్ణధర్మ పరిరక్షణే ధ్యేయంగా పరిపాలన సాగుతోన్న మన రాజ్యంలోనే ధరణి ఒక విదేశీయుడితో ప్రేమలో పడి వర్ణాశ్రమ ధర్మానికి తిలోదకాలు వొదిలింది. ఈ నేరం క్షంతవ్యం కాదు......."

రాజా వారు తల ఎత్తి ఆ ప్రేమ జంట వేపు తీక్షణంగా చూసేరు.

"ఈ అభియోగం నిజమేనా?" రాజావారి గొంతు ఖంగున మోగింది.

సభలో హాజరైన అందరి కళ్లూ ప్రేమ జంట వేపుకు తిరిగేయి.

ధరణి చిర్నవ్వు నవ్వుతూ "నిజమే ప్రభు! మేమిద్దరం ప్రేమించుకున్నాం. మా వివాహానికి అనుమతించ వలసిందిగా ఏలిన వారిని

వేడుకుంటున్నాం" అంది ధరణి.

సభలో ఉత్కంఠ పతాపంచలైంది.

అయిపోయింది. అంతా అయిపోయింది.

ఇక ప్రేమ జంటను శిక్షించటమే తరువాయి.

"ఈ ధిక్కారానికి శిక్ష ఏంటో తెలుసా?" మీసం మెలివేస్తూ అడిగేరు రాజావారు.

"మామనసులుకలిసేయి. ప్రేమించుకున్నాం. పెళ్లి చేసుకుందికి సిద్ధంగా ఉన్నాం. ప్రకృతి ధర్మాన్ని ఆచరించటం ధిక్కారం ఎలా అవుతుంది ప్రభూ?" సూటిగా అడిగింది ధరణి.

రాజావారి కళ్లు అగ్నిగోళాల్లా ఎర్రబడ్డాయి!

"క్షంతవ్యం కాని ఘోర అపరాదం చేసి కూడా సభలో కనీసం క్షమాభిక్ష అడిగి, చేసిన తప్పును సవరించుకునే అభిప్రాయాన్ని వ్యక్తం చెయ్యకుండా మమ్ములనే ఎదిరించటంలో మీ ఉద్దేశ్యం?"

"ప్రేమ...ప్రేమ....."చుంగ్ గొంతు దర్బార్లో ప్రతిధ్వనించింది.

ధరణి కిలకిలా నవ్వింది.

"అందుకే మీరు శిక్షకు పాత్రులయ్యేరు. ముద్దాయిలే స్వయంగా నేరాన్ని అంగీకరించేరు కనక ఇక విచారణ అనవసరం. శిక్ష విధించటమే అవశ్యం......"

సభ ఊపిరి పీల్చటం కూడా మర్చిపోయి, ధర్మాసనం వేపే గుడ్లప్పగించి చూస్తోంది.

"వర్ణ ధర్మ ధిక్కారానికి సరైన శిక్ష మరణ శిక్షే. కానీ, దౌత్యనీతికి కట్టుబడి, చుంగ్‌కు మరణ దండనకు మారుగా,దేశ బహిష్కారం విధిస్తున్నాం. ఇక, ధరణి పట్ల ప్రజలకు ఉన్న అభిమానం,వాత్సల్యం పరిగణలోకి తీసుకుని, ఆమెకు యావజ్జీవ గృహనిర్బంధమే శిక్షగా భావించి, అమలు జరుప వలసిందిగా ఆదేశిస్తున్నాం." అని, ధర్మాసనం మీంచి లేవబోయేరు రాజావారు.

"ప్రభూ!" ధరణి గొంతు చించుకుని అరిచింది.

రాజావారు ప్రశ్నార్థకంగా చూసేరు.

"చుంగ్‌కు దేశ బహిష్కారం విధించినా, నాకు గృహనిర్బంధం విధించినా, మా ఇద్దరినీ వేరు చేసే శక్తి ఈ సృష్టిలో ఏదీ లేదు. నలుగురు కూచుని ఆలోచించి, గిరిగీసుకున్న నిర్ణయాలనే చట్టాలుగా అమలు పరచబోవటం, ఆ నిర్ణయాలను ధిక్కరించిన వారిని దండించ బోవటం కేవలం అధికారం ఇచ్చిన సంకుచితమైన ఆలోచనా విధానమే తప్ప అన్యం కాదు. మీ అధికారం ప్రకృతిని ఎలాగైతే శాశించలేదో అలాగే మా ఇద్దరినీ విడదీయలేదు. ఇక్కడ మీ అధికారానికి ఓటమి తప్పదు....." గర్జించింది ధరణి.

రాజావారు కూచున్న ధర్మాసనం కదిలిపోతోన్నంతగాకలవర పడ్డారు రాజావారు.

రాజ్యంకోసం, వర్ణధర్మ పరిరక్షణ కోసం ఎన్నో సాహస మారణ హోమాలు జరిపించిన కరవాలం మీదికి రాజావారి చెయ్యి అసంకల్పంగానే వెళ్లింది.

క్షణంలో ఆవేశాన్ని ప్రయత్నపూర్వకంగా అణచుకుంటూ ధరణి వేపు చూసేరు.

పూర్ణచంద్రబింబంలాంటి ఆ ముఖం, అమాయకత్వంతో పాటు సమపాళ్లలో ఆమె కళ్లలో కనిపిస్తోన్న నిర్భీతి.......

రాజావారు సాలోచనగా తలపంకిస్తో, ధర్మాసనంమీంచిలేచిహుందాగాఅంతఃపురం లోకి నిష్క్రమించేరు.

☆ ☆ ☆ ☆ ☆

కాలం ఇరవయ్యో శతాబ్దం!

రాచరికం అంతరించి చాలా కాలమైంది. రాజులు కాలగర్భంలో కలిసి పోయారు. కోటలు బీటలు పడి, కాలం తిని విసిరేసిన కంకాళాల్లా మొండి గోడలు మిగిలేయి - ఆనవాళ్లుగా

ఇరవై శతాబ్దాల పరిణామంలో కూడా.....

ఇప్పుడూ కృష్ణవేణమ్మ అలల మీద ఉయ్యాలలూగుతో, ప్రేమ జంటలు కనిపిస్తున్నాయేంటో!

సాంఘిక కట్టుబాట్ల పేరిట, ప్రేమకు విధించబడ్డ గొలుసుల్ని ఛేదించే ధైర్యం లేకా, ప్రకృతి ధర్మమైన ప్రేమకు అకర్షితం కాకండా దూరంగా ఉండలేకా - సంఘ భయంతో ఆత్మ హత్యలకు పాల్పడి, తన ఒడిలో దాకుంటున్న ప్రేమ జంటలను స్పృశించిన ఆ వేదనతో -

కృష్ణవేణమ్మ - కలత పడ్డ లేడిలా .......

దూరంగా, గొలుసు కొండల్లో మెలి తిరిగిపోతో.....

ఒంటరిగా వేదన పడే సుఖం లోని రహస్యం ఒక్క కృష్ణవేణమ్మకే తెలుసునేమో!

దూరంగా......

శిథిలమైన ధరణి కోట, శవం చెక్కిలిపై గడ్డ కట్టిన కన్నీటి చారికల్లా......

జాలు కురుస్తోన్న వెన్నెల్లోనూ ఎంత విషాదమో!

కదిపితే చాలు, ఆ కొమ్మా, ఈ రెమ్మా పాల కన్నీళ్లే కారుస్తున్నాయ్.

అవునూ ....ఋషి ధ్యానమా, ఈ ప్రకృతి మౌనం?

☆

